**కథ**

# చేపకి చిక్కని గాలం

జాలరికి చేపల్ని వేటాడ్డం సరదా! చేతిలో తుపాకి ఉన్నవాడికి జంతువుల్ని వేటాడ్డం సరదా! పులికి మేకని వేటాడ్డం సరదా అంతే సింహానికి జింక మీద పంజా విసరడం సరదా. కొందరు మగాళ్ళకి ఆడాళ్ళని వేటాడడమే సరదా! ఫణీంద్రని చూస్తుంటే అపర్ణకి కూడా అలానే అనిపిస్తోంది. ఆమె కళ్ళకి అతను వేటగాడిలానే కనిపిస్తున్నాడు.

★★★

''హలో! గుడ్ మార్నింగ్'' అంటూ వినిపించడంతో చివ్వున తలెత్తి మాటలు వినిపించిన దిశగా చూసింది అపర్ణ.

ఫణీంద్ర! చిన్న చిర్నవ్వుతో ఆమె సీట్ దగ్గరికి వస్తూ కనిపించాడు. అతని నవ్వు చూస్తుంటే ఆమెకి అసహ్యంతో ఒళ్ళు జలదరించింది

''ఏవిటీ? ఇవాళ పెందరాళే వచ్చేశారు'' దగ్గరగా వచ్చేసి ఆమెకెదురుగా టేబిల్ మీద రెండు చేతులూ ఆన్చి ముందుకి వాలి మరీ అడిగాడు.

ఆ భంగిమలో అతని ముఖం ఆమె ముఖానికి దగ్గరగా వచ్చేసింది. కంపరంగా అనిపించడంతో అప్రయత్నంగానే కొంచెం వెనక్కి వాలిందామె.

''అర్జంటు ఫైల్సుంటేనూ...'' బలవంతగా అదిమి పెట్టాలన్నా ఆమె గొంతులో ఇబ్బంది దాగలేదు.

అది చూసి, అదోలా కళ్ళెగరేసి తమాషాగా నవ్వాడతను.

''కెన్ ఐ హెల్ప్ యూ!'' ఇంకొంచెం ముందుకి వంగి అడిగాడు.

అపర్ణకి ఒళ్ళంతా చెమటలు పట్టాయి. తన్ని అంత దగ్గరగా ఎవరైనా చూస్తే ఆ తర్వాత పరిణామాలెలా వుంటాయో ఆమెకి తెలుసు. భయంగా చుట్టూ చూసింది ఎవరైనా తమని గమనిస్తున్నారేమోనని. అదృష్టవశాత్తు ఆఫీస్‌లో ఆనూ సెక్షన్ సీనియర్ తప్ప ఇంకెవరూ లేరు. ఆ పక్క సీనియరూ క్యాంటీన్ వైపు వెళ్ళిపోయినట్టున్నాడు. అతనక్కడ కనిపించలేదు. బతుకు జీవుడా అనుకుంది.

''నో థాంక్స్! నా వర్క్ నేను చేసుకోగలను'' కొంచెం వాడిగానే అంది.

గాఢంగా నిట్టూర్చాడతను.

''ప్చ్! ఎప్పుడూ ఇంతే మీరు. మీ సేవకు చరితార్థుడనయ్యే ఛాన్స్ నాకివ్వరు కదా!'' [illegible]గా ముఖం పెట్టి అన్నాడు.

అపర్ణకి ఒళ్ళు మండిపోయింది.

'ఆ ఛాన్స్ నీకు ఈ జన్మలోనే కాదు. వచ్చే జన్మలో కూడా ఇవ్వను' కసిగా మనసులోనే అనుకుంది.

''ఏవిటి విశేషాలు?'' టేబిల్ అంచు మీద ఎక్కి కూర్చుంటూ ఆరా తీశాడు ఫణీంద్ర.

అంత త్వరగా అక్కణ్ణుంచి కదిలే ఉద్దేశ్యం అతనికి లేదని అపర్ణకి అర్థమైంది.

''నాకు అర్జంట్ ఫైల్స్ నాలుగున్నాయి. వాటిని బాస్ వచ్చే లోపు పూర్తిచేసెయ్యాలి. ఇప్పుడు సరిగ్గా తొమ్మిదయింది. పది కొట్టగానే ఆయనొచ్చేస్తాడు. అంచేత...'' అర్థోక్తిలో ఆగిపోయి అతని ముఖంలోకి చూసింది అపర్ణ.

''అయితే నన్నిక్కణ్ణుంచి వెళ్ళిపోమంటారు'' అదోలా అడిగాడు.

''అవును!'' మొహమాట పడుతూనే చెప్పేసింది.

మరోసారి గాఢంగా నిట్టూర్చాడతను.

''సర్లెండి. మళ్ళీ లంచ్‌బ్రేక్‌లో కలుద్దాం'' చెప్పేసి తన సీట్‌వైపు వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయినా ఆమెకి గుండెదడ తగ్గలేదు. ఫైల్ తెరిచిందన్న మాటేగానీ వర్క్ చెయ్య బుద్ధి కాలేదు. అసలు ఫణీంద్ర బెడదని ఎలా వదిలించుకోవాలో కూడా ఆమెకి అర్థం కాలేదు.

అపర్ణ మామూలు మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన అమ్మాయి. చిన్నప్పట్నుంచీ ఆమె చదువు గురించే ఆలోచించింది. అదయిపోయాక ఉద్యోగం గురించి ఆలోచించింది. ఈ ఆఫీస్‌లో ఉద్యోగం వచ్చాక ఇప్పుడు మరో మెట్టు పైకి ఎక్కడం గురించీ, జూనియర్ అసిస్టెంట్ హోదాలోంచి సీనియర్‌గా ప్రమోటవడానికి అహర్నిశలూ శ్రమిస్తోంది. తానూ, తన కుటుంబం, తన జీతం, తన ఉద్యోగం ఇవి తప్ప ఆమెలో మరో ఆలోచన లేదు. పెళ్ళి గురించి ప్రయత్నాలు మొదలుపెడితే అందులో ఎన్ని చేదు అనుభవాలు ఎదురవుతాయో ఆమెకి తెలుసు. అందుకే ఆ పదాన్నే ఆమె పక్కకి నెట్టేసింది.

అలా కెరీర్‌నే సర్వస్వంగా భావిస్తూ రోజులు నెట్టేస్తున్న అపర్ణ మీద ఫణీంద్ర దృష్టిపడింది. అతడు ఏ ముహూర్తాన వేరే బ్రాంచ్ నుంచి ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చాడో కానీ వచ్చిన క్షణం నుంచే అపర్ణతో మాట కలపాలనీ, పరిచయం పెంచుకోవాలనీ విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు.

అతని ప్రయత్నాలు తన దగ్గర సాగవని అపర్ణకి ఖచ్చితంగా తెలుసు. కానీ ఆ చేష్టల్ని ఆఫీస్‌లో వాళ్ళెవరయినా గమనిస్తే అప్పుడు తన వెనక తన గురించీ ఫణీంద్ర గురించీ ఎన్ని గుసగుసలు రేగుతాయోనన్నదే ఆమె భయం!

అందుకే అతను తన సీట్ దగ్గరికి వస్తున్నాడంటే చాలు, ఒక రకమైన భీతి ఆమెని చుట్టుముట్టేస్తోంది. ఆ భయంతోనే అతన్ని ఏమీ చెయ్యలేక పోతోందామె.

ఆలోచనల్లో వుండగానే ఐదయింది. పెండింగ్ వర్క్ మొత్తం పూర్తవడంతో ఆఫీస్ లోంచి బయటపడింది అపర్ణ. అక్కడా ఫణీంద్ర బెడద తప్పలేదామెకి.

''క్రిక్కిరిసిపోయిన ఆ బస్సుల్లో ఏం ప్రయాణం చేస్తారుగానీ, రండి! నా స్కూటర్ మీద మిమ్మల్ని డ్రాప్ చేస్తాను'' తన డొక్కు స్కూటర్ని తెచ్చి ఆమె పక్కన ఆపుతూ అన్నాడు.

''ఫర్వాలేదులెండి. నేను వెళ్ళగలను'' చెప్పేసి వచ్చిన బస్సుని నెంబరు కూడా చూడకుండా పరిగెత్తుకుంటూ వెళ్ళి ఎక్కేసింది. నెక్స్ట్ స్టాప్‌లో దిగిపోయి అక్కడ తనకి కావలసిన బస్సు ఎక్కింది. పావుగంట తర్వాత తను దిగాల్సిన బస్టాప్‌లో దిగిపోయి ఇంటికెళుతోంది. ఇంటికి చేరుకున్నాక తన వాళ్ళ మధ్య తనకి సంబంధించిన పనిపాటల్తో ఆమెకి సమయం ఇట్టే గడిచిపోయింది.

★★★

పెండ్యులమ్ వాల్‌క్లాక్ ఠంగున తొమ్మిది కొట్టే సరికి ఉలిక్కిపడింది అపర్ణ! పడుకున్న మంచం మీంచి లేవాలనిపించలేదామెకి. ఫలితం అటు నుంచి ఇటు ఒత్తిగిలిందామె.

''అపర్ణా! ఆఫీస్‌కి టైమవుతోంది'' వంటింట్లోంచి తల్లికేక వినిపించింది.

''ఈ పూట వెళ్ళనమ్మా!'' గదిలోంచే సమాధానం చెప్పింది అపర్ణ.

''ఎందుకూ?'' మళ్ళీ తల్లి ప్రశ్న.

''బద్దకంగా వుంది'' చెప్పింది.

నిజానికి అది బద్ధకం కాదు. భయం! ఆఫీస్‌లో అనుక్షణం వెంటాడే ఫణీంద్ర చూపుల నుంచీ, మాటల నుంచీ తప్పించుకోలేదేమోనన్న భయం. ఇప్పటికే ఆఫీస్‌లో ఇద్దరు ముగ్గురు గమనించారు, ఫణీంద్ర తన సీట్ దగ్గరికి తరచూ రావడాన్ని, తనతో మాట్లాడడాన్నీను! బస్టాప్‌లో అయితే అదే టైమ్‌కి తనతోపాటు బస్సెక్కే వాళ్ళు చాలా మందికి తెలుసు, అతను వచ్చి తనకి లిఫ్టిస్తానని అడగడం.

అక్కడికీ రెండు రోజుల క్రితం ఓ కాలేజీ స్టూడెంట్



అడగనే అడిగింది, ''ఆ అంకుల్ లిఫ్టిస్తానని రోజూ బతిమాలుతూనే వున్నాడు. హాయిగా ఎక్కి వెళ్ళిపోవచ్చు కదాంటీ ఎందుకు ఆలోచిస్తారూ?'' అంటూ!

మరో పెద్దావిడ ముక్కు-మొహం తెలి ...కపోయినా దగ్గరికొచ్చి మరీ చెప్పింది, ''ను... చూస్తే పెళ్ళికాని అమ్మాయిలా వున్నావు. అత... చూస్తే నువ్వంటే పడిచచ్చేట్టున్నాడు. ఆ కుర్ర... పెళ్లి కాని వాడయితే నిన్ను ప్రేమిస్తున్నాడేమో ...ళ్లి చేసుకుంటాడో లేదో అడుగు. ఒకవేళ పెళ్ళ... న వాడయితే ఈ వ్యవహారాన్ని సాధ్యమైనంత ...ందరగా కట్ చెయ్యి. లేదంటే అనవసరంగా చిక్కు...ల్లో పడతావ్'' అంటూ.

అదుగో... ఆవిడ ఆ మాటలన్న క్షణ... నుంచే అపర్ణలో ఆలోచన మొదలైంది. ఆలో... ఎక్కువయ్యే కొద్దీ ఏవేవో భయాలు. ...నిపోని భ్రాంతులు.

నిజమే! అతన్ని ఇక్కడితో ఆపకపో... రోజూ తన చుట్టూ తిరుగుతూనే వుంటాడ... చూసే వాళ్ళకదో వినోదం. ఆపైన అతనిలా... మరి కొందరు మగాళ్ళకి అవకాశం. తను వాటిని భరించలేదు. అలా అని అతన్ని చెప్పు తీసుక్కొట్టే ధైర్యం తనకి లేదు. కనీసం అతన్ని చెప్పుతీసుక్కొట్టినంత పని చేసినట్టుగా మాట్లాడే తెగింపు కూడా లేనందుకు తనని తనే తిట్టుకుంది.

ఎలా?

ఏవిటి చెయ్యడం?

గత నాలుగు రోజుల్నుంచీ అదే ఆలోచిస్తోంది.

ఆరోజు కూడా ఆలోచనల్తోనే మధ్యాహ్నం గడిచి సాయంత్రమైంది.

కానీ సమస్యకి పరిష్కారం మాత్రం దొరకలేదు.

ఇంతలో, జయ వచ్చింది. ఆమె అపర్ణకి బాల్యస్నేహితురాలు. ప్రాణానికి ప్రాణం! తనవాళ్ళతో సైతం చెప్పుకోలేని విషయాలన్నిటికీ శ్రోత, పరిష్కర్త, అన్నీ జయే! అలాంటి స్నేహితురాలు దొరకడం తన పూర్వజన్మ సుకృతం అని ఆమె చాలా సార్లు అనుకుంది. సరిగ్గా అలాటి సమయంలోనే జయకి పెళ్ళయింది. ఫలితంగా ఇద్దరి స్నేహంలోనూ చిన్న ఎడబాటు!

జయని చూడగానే అపర్ణకి ప్రాణం లేచొచ్చింది. ఎదురెళ్ళి మరీ ఆమెని వాటేసుకుంది.

''ఏవిటే అలా ఉన్నావ్?'' కొంచెం స్థిమితపడ్డాక అడిగింది జయ.

ఆ ప్రశ్నకి ఉలిక్కిపడింది అపర్ణ.

''ఎలా వున్నాను?'' ఉలికిపాటును కప్పిపుచ్చుకుంటూ అడిగింది.

''ఏదో పోగొట్టుకున్నదాన్లా... ఏవిటీ!... ఏదైనా లవ్ ఎఫైరా?'' నిశితంగా చూస్తూ ఆరా తీసింది.

ఈసారి అపర్ణ అదిరిపడింది. నిజానికి ఫణీంద్ర విషయం ఆమెకి చెప్పాలనుకోలేదు. జయ సాన్నిధ్యంలో అతని వల్ల తానను భవించిన నరకాన్ని మర్చిపోవాలని మాత్రమే అనుకుంది. తలవని తలంపుగా జయే

ఎ.కె.వి. రత్నమాల

ఆ టాపిక్ తెచ్చేసరికి... అంతా చెప్పి గుండె బరువు తీర్చుకోవడమే మంచిదనిపించింది అపర్ణకి.

''లవ్వే... అఫెయిర్ మాత్రం కాదు'' నిట్టూరుస్తూ చెప్పింది.

''ఇదేదో వెరైటీగా ఉందే'' భృకుటి ముడివడింది జయకి.

ఫణీంద్ర తన బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫరై వచ్చిన క్షణం నుంచీ నిన్నటి వరకూ జరిగిందంతా పూసగుచ్చినట్టు చెప్పింది అపర్ణ.

''అదీ సంగతి! ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు నాకు'' దిగులుగా అంది అపర్ణ.

జయకి విషయం మొత్తం అర్థమైంది.

''కొట్టావద్దు, తిట్టావద్దు. తెలివిగా వాణ్ణి తప్పించే మార్గం నేను చెబుతాను'' అంది.

బాగా ఆలోచించి ఏం చెయ్యాలో చెప్పింది కూడా! జయ చెప్పిన ఐడియా వినేసరికి అపర్ణకి ఎక్కడలేని హుషారు వచ్చేసింది.

★ ★ ★

''ఏవిటలా వున్నారు? ఎనీ ప్రోబ్లమ్?'' చెంపకి చెయ్యి చేర్చుకుని దిగులుగా కూర్చున్న అపర్ణని చూస్తూ అడిగాడు ఫణీంద్ర.

అతనలా అడిగీ అడగగానే అతనికనిపించేట్టుగా ఉలిక్కిపడింది.

''అబ్బే! ఏం లేదు... ఏం లేదు...' అంది తడబాటు నటిస్తూ.

''లేదు... ఏదో వుంది. మీరు దాస్తున్నారు. చెప్పండి. ఏవిటది?'' రెట్టించాడు ఫణీంద్ర.



''నా బాధ ఏదైతే ఏం లెండి. మీరేమైనా ఆరుస్తారా? తీరుస్తారా? కొంచెం నిష్ఠూరంగానే అంది.

ఆ మాట అతనికి ఎక్కడ తగలాలో అక్కడే తగిలింది.

''ఎంతమాట?'' కించిత్ బాధని నటించాడు. ''అసలు మీ బాధేవిటో చెప్పండి. ప్లీజ్!'' అర్థించాడు.

''అర్జంటుగా చూడాల్సిన ఫైల్స్ చాలా వున్నాయి. నాకేమో ఒంట్లో బావుండలేదు. సిఎల్స్ లేవని చచ్చి చెడి ఆఫీస్‌కొచ్చాను కానీ లేకపోతే ఇంట్లోనే వుండిపోయేదాన్ని'' చెప్పడం ఆపి అతని ముఖంలోకి చూసింది.

''అంచేత... మీ ఫైల్స్ నేను చూసి పెట్టాలి. అంతేగా!'' అడిగాడతను.

సమాధానంగా, కావాలనే రెండు రోజుల్నించీ పెండింగ్‌లో పెట్టిన ఫైల్స్‌ని అతనికి అందించేసింది అపర్ణ. ఆ తర్వాత, ఫైల్స్ చూడ్డంలో బిజీ అయిపోయిన అతనికి సహజంగానే ఆమెతో మాట్లాడ్డానికి తీరిక చిక్కలేదు.

## శ్రీవారంటే...?

పెళ్లయి యిన్నాళ్లయింది కదా మాధురీ! మీ వారి గురించి ఏమైనా చెప్తారా? అంటే-

★ మావారి గురించి ఇంకా నాకు తెలియనిది చాలా వుంది.

★ అర్థం అయినట్టే వుంటారు, కారు.

★ ఆయన్ని అర్థం చేసుకోవడం చాలా కష్టం.

★ వివాహజీవితం మాత్రం పూర్తిగా డిఫరెంట్‌గా వుంది. అన్నిటికీ ఎడ్జస్టు కావాలి. (వార్నీ! నీకూ ఆ సమస్యేనా?)

★ ఇండియా, యు.ఎస్., తిరగలేకపోతున్నాను.

★ పిల్లలు అప్పుడే వద్దనుకున్నా

★ మావారికి పిల్లలంటే ఇష్టమే! కానీ అప్పుడే వద్దట.

★ శ్రీవారంటే చాలా ఇష్టం.

ఓకే మాధురీ! మీ వారి గురించి పూర్తిగా త్వరలో తెలుసుకోవాలని కోరుకుంటాం!

ఆ మర్నాడు ఫణీంద్ర తన సీట్ దగ్గరికి రాగానే మరో రెండు ఫైల్స్ అంటగట్టేసింది అపర్ణ. ఏడవలేక నవ్వుతూ వాటినందుకున్నాడతను.

ఆ సాయంత్రం... బస్టాప్‌లో, అతని స్కూటర్ ఎక్కమంటూ తనకి సలహా ఇచ్చిన కాలేజీ టీనేజీ అమ్మాయిని, ఇంటి దగ్గర దించే బాధ్యతని ఫణీంద్ర భుజస్కందాల మీదుంచింది.

స్కూటర్ మీద ఆ పిల్లని ఇంటి దగ్గర దించడానికి అతనికి, పెట్రోలు హారతి కర్పూరంలా అయిపోయింది. ఆపైన ఆ పిల్ల నవ్వుతూనే ఫణీంద్ర స్కూటర్‌ని దార్లో రెండు మూడు సార్లు ఆపించింది. ఆపినప్పుడల్లా ఐస్‌క్రీంలూ, కూల్‌డ్రింక్సూ, అవీ ఇవీ అంటూ అతని జేబుల్ని ఖాళీ చేయించింది.

ముదిరిపోయిన బెండకాయలాంటి అపర్ణతో బాటుగా, టీనేజీ కాలేజీ పిల్లని కూడా లైన్లో పెట్టుకుంటే ఎలా వుంటుందన్న ఫణీంద్ర ఆలోచన ఆ దెబ్బతో అణగారిపోయింది.

మరో రోజు...

''ఇంటికి రండి!'' అంటూ ఫణీంద్రని నవ్వుతూ ఆహ్వానించింది అపర్ణ.

ఆ ఆహ్వానానికి ఐసయిపోయి, ఆమెని స్కూటర్ మీద ఎక్కించుకుని బయల్దేరాడు ఫణీంద్ర. నాలుగ్గజాలు కూడా పోకముందే ఫణీంద్ర స్కూటర్ ఆపించేసి ఓ నాలుగు రకాల కూరలు కొంది అపర్ణ. వాటికి డబ్బులు అతని చేతే ఇప్పించింది.

మరో సగం దూరం వెళ్ళాకా... ఓ పాతిక కేజీల బియ్యం బస్తా ఒకటి కొన్ని ''ఇఫ్ యూ డోంట్ మైండ్'' అంటూనే దాన్ని కూడా అతని స్కూటర్ మీద వేసేసింది. ఆ దెబ్బతో అతనికి తలకొట్టేసినంత పనయింది.

అపర్ణ మధ్యతరగతి అమ్మాయి... ఆపైన అవివాహిత కనుక తను వెర్రి మొర్రి వేషాలేయగానే ఆమె తన వెనక పరిగెత్తుకొచ్చేస్తుందనుకున్నాడు. వెంటనే తన వలలో పడిపోతుందని కూడా భ్రమపడ్డాడు. కానీ ప్రస్తుతం అపర్ణ ప్రవర్తన చూస్తుంటే ఆమెకి తన ప్రవర్తన నచ్చకపోవడం వల్లనే అలా ఎదురుదాడికి దిగిందని గ్రహించాడు. దాంతో మెల్లగా అపర్ణకి దూరమై, పూర్తిగా ఆమె జోలికి రావడం మానుకున్నాడు.

జయ ఆలోచన, తన ఆచరణ, ఫణీంద్రకి గుణపాఠం కావడంతో హాయిగా ఊపిరి పీల్చుకుంది అపర్ణ!

జాలరి చూపిన ఎరకి ఆశపడి గాలానికి చిక్కే చేపలుంటే వుండవచ్చు! కానీ... ఎరతో పాటుగా గాలాన్నీ, జాలరినీ కలిపి గుటుక్కుమనిపించే చేపలు కూడా వుంటాయన్న విషయాన్ని నిరూపించిన తన జోలికి ఫణీంద్రే కాదు, ఇక ఆఫీస్‌లో ఏ మగాడూ రాడు... అనుకుంటూ గర్వంగా నవ్వుకుంది అపర్ణ.